ప్రజాశక్తి
సోమవారం 14 జులై 2025
5
పార్వతీపురం మన్యం

అనారోగ్యంతో పుబ్బాడ పంచాయతీ కార్యదర్శి మృతి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పుబ్బాడ పంచాయతీ కార్యదర్శి మీనక జీవన్ కుమార్ (29) శనివారం మృతి చెందారు. సామరెల్లికి చెందిన జీవన్ కుమార్ లివర్ సమస్యతో బాధపడుతున్నట్లు తెలిసింది. శుక్రవారం ఆయన్ను స్థానిక ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. శ్రీకాకుళంలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు సంబంధించిన కార్యదర్శులు తెలిపారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. జీవన్‌కుమార్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

అధికారుల నిర్లక్ష్యం... రైతులకు శాపం

- ఖరీఫ్ సమీపిస్తున్నా గుమ్మడిగెడ్డ రిజర్వాయర్‌పై నిర్లక్ష్యం
- షట్టర్ల లాకులు బాగు చేసేదెప్పుడు ?
- జంగిల్ క్లియిరెన్స్ చేపట్టేనా?
- శివారు భూములకు సాగునీరు ప్రశ్నార్థకమే!

పంటలు పండించేందుకు సాగునీరందించాల్సిన గుమ్మిడిగెడ్డ మినీ రిజర్వాయర్‌కు గ్రహణం పట్టింది. ప్రతిఏటా శివారు భూములకు సాగునీరందిస్తాం. అన్నదాతను ఆదుకుంటామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వాలు రిజర్వాయర్ అభివృద్ధికి హామీలు ఇస్తున్నప్పటికీ అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు సరే కదా కనీసం షట్టర్లు బాగు చేసి కాలువలు జంగిల్ క్లియరెన్స్ చేసి సాగు భూములకు నీరందిచాలన్న కనీస బాధ్యతలు కూడా ఇరిగేషన్ అధికారులకు లేదని రైతులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.

షట్టర్ల్ లేక వధాగా పోతున్న గుమ్మడి గెడ్డ రిజర్వాయర్ నుంచి నీరు

ప్రజాశక్తి- కురుపాం

దశాబ్దాల కాలం నుంచి గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులు జరగక రైతులకు నిరాశ మిగిలింది. ఈ రిజర్వాయర్ పనులు పూర్తయితే గిరిజన రైతాంగంతో పాటు మైదాన ప్రాంతంలో రైతులకు సూమారు 10 వేల ఎకరాల భూమికి సాగునీరందేది. కానీ రిజర్వాయర్ నిర్మాణ పనులు జరగక కేవలం 1500 ఎకరాలకు మాత్రమే సాగునీరు అందుతుంది. నిర్మాణ పనుల కోసం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అధికారులు ప్రతిపాదనలు పంపగా, అప్పట్లో రూ.13.80 కోట్లు మంజూరు చేయగా సాంకేతిక సమస్యలున్నాయని, తోటపల్లి బ్యారేజ్‌కు ఇన్‌ఫ్లో తగ్గిపోతుందని ఈ ప్రాజెక్టును నిలిపివేశారు. ఆ తర్వాత టిడిపి ప్రభుత్వ హయాంలో మళ్లీ అధికారులు ప్రతిపాదనలు పంపినప్పటికీ కనీసం ఆ ప్రస్తావనే లేకుండా పోయింది. కొత్తగా మినీ జలాశయం నిర్మాణానికి 2021-22లో రూ.39 కోట్లతో అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించినా మోక్షం కలగలేదు. వైసిపి హయాంలో కురుపాంలో జరిగిన అమ్మఒడి కార్యక్రమానికి విచ్చేసిన అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దృష్టికి ఈ సమస్యను మాజీ ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి తీసుకొచ్చారు. దీనికి ఆయన స్పందించారు. అనంతరం రూ.44 కోట్లతో 4,500 ఎకరాలకు సాగునీరందించేందుకు అధికారులు ప్రతిపాదనలు తయారు

పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువ

చేసి పంపించగా నిధులు మంజూరు అయ్యాయని, పనులు చేపడతామని రైతాంగానికి తెలియజేసినప్పటికీ ఈలోగా ఎన్నికలు వచ్చేశాయి. ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆగి అది కేవలం బుట్ట దాఖాలయ్యాయి తప్ప అమలు కాలేదు. గత ఏడాది ఎన్నికల ముందు సాక్ష్యాత్తు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కురుపాం మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్ వద్ద ఎన్నికల సభలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గుమ్మడి గెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులు చేపట్టి రైతాంగానికి, శివారు భూముల వరకు సాగునీరందించి, సస్యశ్యామలంగా చేస్తామని హామీ ఇచ్చి ఏడాది అవుతున్నా అమలుకు నోచుకోలేదు. దీంతో ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛను ఏ ప్రభుత్వ హయాంలో నెరవేర్చుతుందో అర్థం కావడం లేదు. దశాబ్దాలుగా కాంగ్రెస్, టిడిపి, వైసిపి హామీలు గానే మిగలగా, ఇప్పుడున్న కూటమి ప్రభుత్వమైనా గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణ పనులకు శ్రీకారం చుడుతుందేమోనని ఈ ప్రాంత రైతులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు.

దశాబ్దాలుగా హామీలు అమలు కావడం లేదు

గుమ్మడిగెడ్డ మినీ రిజర్వాయర్ నిర్మాణంపై దశాబ్దాల కాలం నుంచి అన్ని పార్టీలు ఎన్నికల ముందు బహిరంగ సభల్లో కేవలం హామీలు ఇస్తున్నాయి తప్ప అధికారంలోకి వచ్చిన తర్వాత వాటివి విస్మంచి రైతాంగాన్ని చిన్న చూపు చూస్తున్నాయి. సరే కదా కనీసం షట్టర్లు బిగించడం, కాలువలు జంగిల్ క్లియరెన్స్ చేసే దాఖలు కనిపించడం లేదు. ఇప్పటికే ఖరీఫ్ సాగుకు సన్నద్ధమైన రైతులకు ఎప్పటిలాగే నిరాశ మిగులుతుంది. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి కనీసం కాలువలో జంగిల్ క్లియరెన్స్ చేయించి షట్టర్లు బిగిస్తే కొంతమేరకైనా రైతులకు సాగునీరు అందుతుంది.

కొల్లి గంగునాయుడు,
సిపిఎం జిల్లా కార్యదర్శి, పార్వతీపురం మన్యం జిల్లా.

ఉచిత పంటల బీమాకు రాం.. రాం

- ఇన్సూరెన్స్ ప్రీమియం రైతులు చెల్లించుకోవాల్సిందే
- బాధ్యత నుంచి తప్పకున్న ప్రభుత్వం
- ఎకరా పత్తికి రూ.1923, వరికి రూ.200



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అతివృష్టి, అనావృష్టి వంటి సందర్భాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఇటువంటి సందర్భాల్లో కనీసం పెట్టిన పెట్టుబడి అయినా పదిలం చేసుకునేందుకు పంటల బీమా పథకాన్ని ప్రభుత్వాలు దశాబ్దాల తరబడి ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గతంలో వైసిపి ప్రభుత్వం ఉచిత పంటల బీమా పథకాన్ని వర్తింపజేసింది. బ్యాంకు రుణాలు తీసుకోవడం, ఇ-క్రాప్ బుకింగ్ వంటి సందర్భాల్లో రైతులకు ప్రభుత్వం తరపున నేరుగా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించేది. దీంతో రైతులకు కొంతలో కొంత ఊరట ఉండేది. కూటమి ప్రభుత్వం తాజాగా ఉచిత పంటల బీమా పథకాన్ని ఎత్తివేసింది. బ్యాంకు రుణాల సందర్భంగా ఇన్సూరెన్స్ పొందలేని రైతులు సొంతంగా బీమా ప్రీమియం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. లేదంటే బీమా ఆశలను వదులుకోవాల్సిందే. ఈ ఏడాది ఎప్పటి మాదిరిగానే మన జిల్లాలో పత్తి, వరి, మొక్కజొన్న, నువ్వుల పంటలకు వర్తింపజేసింది. ఈ పంటలన్నింటికీ ఇఫ్కో టోకియో జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీకి ఎకరా పత్తి విస్తీర్ణానికి రూ.1923 చొప్పున ప్రీమియం చెల్లించాలి. వరికి రూ.200, మొక్కజొన్నకు రూ.165, నువ్వులకు రూ.65 చొప్పున ప్రీమియం చెల్లించాలి. ఇందుకుగాను పత్తికి రూ.95 వేలు, వరికి రూ.40 వేలు, మొక్కజొన్నకు రూ.33 వేలు, నువ్వులు రూ.13 వేలు చొప్పున బీమా వర్తిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీ నిబంధనల ప్రకారం... వరి పంటకు గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టాన్ని పరిగణిస్తారు. మిగిలిన మూడు రకాల పంటలకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నష్టాన్ని పరిగణించనున్నారు.

ఇంతకు ముందులా ఉచిత పంటల బీమా లేదు. అటువంటి బీమాతో ఉంటే రైతులు మరింతగా నష్టపోయినట్టే. ఎందుకంటే? గత ఆరేళ్లు అమలు చేసిన ఉచిత పంటల బీమా పథకానికి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఇక నుంచి రైతులే ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించుకోవాలి. పెరిగిన వ్యవసాయ మదుపులకు ఇదో అదనపు పెట్టుబడిగా భావించాల్సిందే. లేదంటే కరువు కాటకాల వేళ బీమా పొందే అవకాశాన్ని అయినా వదులుకోవాల్సి ఉంది.

పత్తి రైతులకు ఒక్కరోజే గడువు

పత్తి రైతులు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపునకు ఒక్కరోజు మాత్రమే గడువు ఉంది. ఈనెల 15వ తేదీతో గడువు ముగియనుంది. మొక్కజొన్న, నువ్వుల పంటకు ఈ నెలాఖరులోపు చెల్లించుకోవాలి. వరి పంట ఇన్సూరెన్స్‌కు ఆగస్టు 15వ వరకు సమయం ఉంది. ఇప్పటికే ఎరువులు, విత్తనాల ధరలు, ట్రాక్టర్ అద్దెలు అమాంతంగా పెరిగాయి. ఈ నేపథ్యంలో ఇన్సూరెన్స్ చేసుకునేందుకు రైతులు ముందుకు రాలేకపోతున్నారు. మరోవైపు ప్రీమియం చెల్లింపునకు గడువు సమయం ముంచుకొస్తుండటంతో రైతుల్లో బీమా దీమా సన్నగిల్లుతోంది.

పిజిఆర్ ఎస్ వివరాలకు 1100 నెంబరుకు ఫోన్ చేయవచ్చు

పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో సమర్పించిన అర్జీల స్థాయిని 1100 టోల్ ఫ్రీ నెంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరించడం జరుగుతుందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు సెల్లార్‌లో ప్రత్యేకంగా సెల్‌ను ఏర్పాటు చేశామని ఆయన చెప్పారు. పిజిఆర్ఎస్ వివరాలు 1100 నెంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు Meekosam.ap.gov.in (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ లోనూ అర్జీలు నమోదు చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, దానికి సంబంధించి సమాచారం తెలుసుకొనేందుకు 1100కు నేరుగా ఫోన్ చేయవచ్చని తెలిపారు.

ఆశ్రమ పాఠశాలలో కనీస మౌలిక వసతులు కల్పించాలి

ప్రజాశక్తి - కురుపాం

మాట్లాడుతున్న అఖిల్

గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి బిడ్డకు అనిల్ డిమాండ్ చేశారు. మండలం లోని ఉదయపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలను ఆదివారం సందర్శించారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారికి ఎదురవుతున్న సమస్యలను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుకోవడానికి కనీసం సరిపడే తరగతి గదుల్లేవని, పడుకోవడానికి డార్మెంటరీ, భోజనానికి డైనింగ్ హాలు కూడా లేదని విద్యార్థులు చెప్పారని తెలిపారు. చదువు, పడుకోవడం, భోజనం అన్నింటికీ ఒకే చోట కావడంతో ఇబ్బందులు పడుతున్నట్టు తెలిపారు. అలాగే ఫిజిక్స్ సబ్జెక్టుకు ఉపాధ్యాయులు లేరని తెలిపారు. ప్రభుత్వ విద్యకు పెద్దపీట వేస్తున్నామనే పాలకులు చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేదని విమర్శించారు. తక్షణమే ఉన్నత అధికారులు స్పందించి కనీస మౌలిక వసతులు కల్పించి పై సమస్యలు పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని అన్నారు.

నగర పంచాయతీ ఇంజినీరింగ్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి పాలకొండ

మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరిస్తామని పాలకులు చెప్పినప్పటికీ నేటికీ పరిష్కారం కాలేదని, చర్చల పేరున గత పది నెలల నుంచి కాలయాపం జరుగుతుందని అందుకే సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర పంచాయతీ గౌరవ అధ్యక్షులు దావాలరమణారావు అన్నారు. రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా జులై 12న అర్ధరాత్రి ఇంజనీరింగ్ విభాగ కార్మికులు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షరతుల్లేకుండా తల్లికి వందనంతో పాటు కార్మికులందరికీ సంక్షేమ పథకాలు వర్తింపు చేయాలన్నారు. జీవో 36 ప్రకారం జీతాలు చెల్లించాలని, పెంపు కేటగిరి నిర్ణయ విషయంలో కూడా జరిగిన పొరపాట్లు సరిదిద్దాలని డిమాండ్ చేశారు. గత 17 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు జీవోలు ఇవ్వాలని, అమలుకు సంబంధిత మంత్రి కార్మిక సంఘాలతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేసి సమ్మె విరమించేలా చూడాలన్నారు ప్రజలకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చూడాలని, తక్షణమే మున్సిపల్ కార్మికుల పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో వై.హరిబాబు, ఎస్.బాబురావు, పి.రమేష్, ఐ.రాజు, కె.రాజేష్, నర్సింగరావు, రాము, సంజీవి, వేణు ఉన్నారు.

సమ్మె శిబిరంలో పాల్గొన్న ఇంజినీరింగ్ కార్మికులు

23న రెండో విడత కౌన్సిలింగ్

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ప్రవేశాలకు మొదటి విడత తర్వాత మిగిలి ఉన్న సీట్లకు రెండో విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ తెలిపారు. ఆన్ లైన్‌లో iti.ap.gov.in వెబ్ సైట్ ద్వారా ఈనెల 20 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా ఈనెల 22లోగా తమ నమోదు యునిక్ నెంబర్, అన్ని ఒరిజినల్ సర్టిఫికేట్లతో తమ దగ్గర గల ఏ ప్రభుత్వ ఐటిఐ నందైనా వెరిఫికేషన్ (ధ్రువీకరణ) చేయించుకొని అప్రోవల్ (ఆమోదం) చేయించుకోవాలన్నారు. అలా చేయబడిన వారి పేర్లు మాత్రమే మెరిట్‌జాబితాలో నమోదవుతుందన్నారు. సదరు వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు మాత్రమే ఐటిఐలో ప్రవేశానికి అర్హులన్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేసుకున్న అభ్యర్థులు మాత్రమే అడ్మిషన్ల కౌన్సిలింగ్‌కు ఈనెల 23న తమ అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో ప్రభుత్వ ఐటిఐ, సీతంపేటలో హాజరు కావల్సిందిగా కోరారు. ప్రభుత్వ ఐటిఐ, సీతంపేటలో రెండేళ్ల కోర్సులైన ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, మెకానిక్ మోటార్ వెహికల్, ఏడాది కోర్సులైన వెల్డర్, కోపా (కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్), డ్రెస్ మేకింగ్ ట్రేడుల్లో మిగిలి ఉన్న సీట్లకు ప్రవేశాలు నిర్వహిస్తామన్నారు. మిగిలియున్న సీట్లలో 10 శాతం మెరిట్ ప్రాతిపదికన మేనేజ్‌మెంట్ కోటాలో ఐఎంసి (Institute Management Committee) ద్వారా తీసుకుంటామన్నారు. ఇతర వివరాలకు 75690 62449, 9491134464 సంప్రదించాలని తెలిపారు.

ప్రయివేట్ మార్కెట్లో విత్తు... రైతు చిత్తు

ప్రజాశక్తి - సీతంపేట

ఏజెన్సీలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. దుక్కులు దున్నడానికి సన్న, చిన్నకారు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఈ సమయంలో ప్రభుత్వం అరకొర విత్తనాలు సరఫరా చేయడంతో రైతులు ప్రైవేట్ మార్కెట్లో కొనుగోలు చేయడానికి పరుగులు తీస్తున్నారు. దీంతో అధిక ధరలతో ప్రైవేట్ మార్కెట్ వ్యాపారులు రైతుల నడ్డి విరుస్తున్నారు.

మండలంలో 5067 ఎకరాల్లో ఖరీఫ్‌లో వరిసాగు చేస్తున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ఈ ఏడాది 1809 క్వింటాలు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో స్వర్ణ, సాంబమసూరు, ఆర్‌జిఎల్ 25 37, ఎం టి య 11 21, ఎం టి యు 12 24, ఎం టి య 13 18, ఎంటియు 10 61 రకాల వరి విత్తనాలు తెప్పించారు. వీటిని 29 రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేశారు. దీనిలో గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. అయితే కుసుమూరు, మానాపురం, టిటికిపాయి, దుగ్గి, కొత్తకోట తదితర పంచాయతీల్లో విత్తనాలు సరిపడినన్ని రాకపోవడంతో ప్రైవేట్ మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేసుకోలేని పరిస్థితి నెలకొంది. అదేవిధంగా అక్కన్నగూడకు చెందిన సవర చండిమి, ఎర్రకువ్వారి గూడకు చెందిన సురేష్, నరేష్, రాజన్నగూడకు చెందిన కృష్ణ తదితర రైతులకు విత్తనాలు పూర్తిగా అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది మానాపురం పంచాయతీకి రెండు వందల బస్తాలు వస్తే ఈ ఏడాది 150 బస్తాలు రావడంతో కొంతమందికి అందలేదు. ఎకరాకు 30 కేజీల బస్తా ఇవ్వడంతో అవి ఎటూ సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ఇటీవల జరిగిన మండల సమావేశంలో సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు.

రైతు సేవా కేంద్రాల్లో అరకొర విత్తనాలు

కొన్నిచోట్ల సర్దుబాట్లు

ధారపాడు సచివాలయం పరిధిలో గల రైతుసేవా కేంద్రంలో విత్తనాలు సరిపోకపోవడంతో పది కిలోమీటర్లు దూరంలో ఉన్న దేవనాపురం రైతు సేవా కేంద్రంలో కొంతమంది రైతులు తీసుకున్నారు. అదేవిధంగా కిల్లాడ పంచాయతీ రైతు సేవా కేంద్రంలో రైతులు జయపురం, జలుబుగూడ, గాడిదిపాయి, ధోనుభాయి రైతు సేవ కేంద్రంలో విత్తనాలు తీసుకున్నట్లు సమాచారం.

కొన్ని పంచాయతీల్లో విత్తనాలు చాల్లేదు

మండలంలోని టిటుకపాయి, దుగ్గి, కొత్తకోట, కుసుమూరు తదితర పంచాయతీల్లో వరి విత్తనాలు అరకొరగా ఇచ్చారని రైతులు మాకు ఫిర్యాదు చేశారు. వెంటనే సంబంధిత అధికారులు సరిపడా విత్తనాలు సరఫరా చేయాలి.

బిడ్డిక ఆదినారాయణ,
ఎంపిపి, సీతంపేట.

పూర్తిగా విత్తనాలు అందలేదు

నాకు వరి విత్తనాలు పూర్తిగా అందలేదు. ఎకరా భూమి సాగు చేస్తున్నాను. బయటి మార్కెట్లో అధిక ధరలు ఉన్నాయి. అయినా దొరకడం లేదు.

సవర సుగన్న,
రాజన్న గూడ గ్రామం.

విత్తనాల కొరత లేదు

మండలంలోని వరి విత్తనాల కొరత లేదు. మొదటి విడతలో విత్తనాలు తెప్పించాం. అవి చాలకపోతే మళ్లీ రెండో విడతలోనూ విత్తనాలు తెప్పించి గిరిజన రైతులకు 90 శాతం సబ్సిడీపై అందజేశాం. ప్రభుత్వం మార్గదర్శకాలు ప్రకారం రైతుకు 33 శాతం అందజేశాం.

వై.వాహిని,
వ్యవసాయ అధికారి. సీతంపేట మండలం.

ఆస్పత్రుల్లో మౌలిక సౌకర్యాల కల్పన

రెండు నెలల్లో భవన నిర్మాణాలు పూర్తిచేస్తాం
జిల్లాలో మందుల కొరత లేదు
'ప్రజాశక్తి'తో ఎపి ఎంఎస్ఐడిసి ఇఇ ఎన్.భారతి ముఖాముఖి

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఎంఎస్ఐడిసి) ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.భారతి తెలిపారు. ఆస్పత్రుల్లో భవనాల నిర్మాణం, మరమ్మతులు చేపడుతున్నామని వివరించారు. మరో రెండు నెలల్లో భవనాలన్నీ పూర్తిస్థాయి అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మందుల కొరతలేదని, ప్రభుత్వ కేటాయించిన మందులను ఆయా సిహెచ్‌సిలు, పిహెచ్ఇలకు, ప్రభుత్వ ఆస్పత్రులకు అందిస్తామన్నారు. మూడు నెలలకు ఒకసారి మందులు వస్తాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలోనే జిల్లాలకు మందులు కేటాయిస్తారని చెప్పారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆమె ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

-ప్రజాశక్తి, కంటోన్మెంట్



ఉమ్మడి జిల్లాలో ఎన్ని భవనాలు నిర్మాణాల్లో ఉన్నాయి.? ఎన్ని పూర్తయ్యాయి.?

ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఎపిఎంఎస్ఐడిసి ద్వారా పలు ఆస్పత్రుల్లో భవనాల నిర్మాణాలను చేపడుతున్నాం. విజయనగరం జిల్లా కేంద్రంలోని మెడికల్ కళాశాలతోపాటు ఘోషాసుపత్రిలో మూడు పనులను చేస్తున్నాం. లిఫ్ట్, వైద్య పరికరాలు, పాడైన క్వార్టర్స్ నిర్మాణ పనులు చేపడుతున్నాం. లిఫ్ట్ సామగ్రికి టెండర్లు పిలిచాం. గజపతినగరం, శృంగవరపుకోట, కురుపాం, సాలూరు, భద్రగిరి, నెల్లిమర్ల, బాడంగి ఆస్పత్రుల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. గజపతినగరం సిహెచ్‌సికి రూ.17 కోట్లు, ఎస్.కోటకు రూ.12.6 కోట్లు, కురుపాంకు రూ.3 కోట్లు, సాలూరుకు రూ.17 కోట్లు, బాడంగికి రూ.8.88 కోట్లు భద్రగిరికి రూ.8.95 కోట్లు, నెల్లిమర్లకు 4.42 కోట్లు, పార్వతీపురం 21.15 కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించింది. మరో రెండు నెలల్లో పూర్తిగా భవన నిర్మాణాలు పూర్తయి, అందుబాటులోకి వస్తాయి.

ఎన్ని ఆస్పత్రుల్లో మరమ్మతులు చేపడుతున్నారు.?

ఉమ్మడి జిల్లాలో సాలూరు ఆస్పత్రికి రూ.20 లక్షలు, చీపురుపల్లికి రూ.9 లక్షలు చొప్పున మరమ్మతులకు నిధులు కేటాయించారు. రిపేరు పనులు జరుగుతున్నాయి.

గత మూడేళ్లలో జిల్లాకు ప్రభుత్వం మందులకు కేటాయించిన నిధులు ఎంత.?

రాష్ట్ర ప్రభుత్వం ఎపిఎంఎస్ఐడిసి ద్వారా జిల్లాలోని వివిధ ఆస్పత్రులకు మందులను పంపిణీ చేస్తుంది. ప్రధానంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి మందులు, సర్జికల్స్ రూపంలో మందులు అందిస్తుంది. 2023- 24లో మందుల కింద రూ.20,82,15,360, సర్జికల్స్‌కు రూ.5,62,31,392, రూ. 2024-25లో మందులకు రూ.22,83,51,127, సర్జికల్స్‌కు రూ.5,78,19,435, 2025-26లో గత మూడు నెలలకు గాను మందులకు రూ.8,12,62,975, సర్జికల్స్ రూపంలో రూ.2,07,54,213ను ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో మందుల కొరత లేదు. పిహెచ్ఇలకు, ఆస్పత్రు లకు మందులను సక్రమంగా అందిస్తున్నాం.

జిల్లా కేంద్రంలో ఎపిఎంఎస్ఐడిసి కార్యాల యంలో గతంలో పని చేసిన ఇఇ శానిటేషన్‌కు టెండర్ లేకుండా చేయించారన్న ఆరోపణలు వచ్చాయి.?

నేను కొద్ది రోజుల క్రితమే ఇఇగా విధుల్లో చేరాను. నా దృష్టికి ఈ విషయం రాలేదు.

కార్యాలయంలో సిబ్బంది కొరత ఏమైనా ఉందా.?

కార్యాలయంలో పర్మినెంట్‌తోపాటు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పని చేస్తున్నారు. ఎక్కువగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

గిరిజనులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ

గిరిజనులకు తాను అండగా ఉంటానని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు శ్రీ వాసవి కల్యాణ మండపంలో ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గిరిజన జెఎసి నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ఒకే తాటిపై పనిచేసి సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. కూటమి ప్రభుత్వం గిరిజనులకు అనుకూలంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన జీవో 3 పునరుద్ధరణకు కాలయాపన చేసిందని విమర్శించారు. అలాగే గిరిజన గ్రామాల్లో అభివృద్ధి అంతంత మాత్రమే జరిగిందన్నారు. ఈ గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కువ ఉందని, విడతల వారీగా ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తానని అన్నారు. గిరిజనులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చేలా ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమలో ఎఎంసి ఛైర్మన్ బిడ్డిక సంధ్యారాణి, గిరిజన సంఘం నాయకులు శ్రీనివాసు తదితరులున్నారు

గురుకుల విద్యార్థికి ట్రిపుల్ ఐటి సీటు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి గిరిజన గురుకుల బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదివిన నల్ల రాహుల్ ఎచ్చెర్ల క్యాంపస్‌లో ట్రిపుల్ ఐటి సీటు సాధించాడు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో 570 మార్కులతో ఉత్తీర్ణత పొందాడు. రెండో విడత కౌన్సిలింగ్‌లో భాగంగా రాహుల్ ట్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపల్ వరప్రసాద్‌బాబు తెలిపారు. అత్యధిక మార్కులతో పాఠశాలకే ప్రథమ స్థానంలో నిలిచిన రాహుల్‌ను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. ట్రిబుల్ ఐటి సీటు రావడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

సీతానగరం : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన గుణుపూరు తనూజ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికైంది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఇల్లా ప్రసన్నలక్ష్మి, పాఠశాల యాజమాన్య కమిటీ ఛైర్మెన్ పలగర శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందలు తెలిపారు.

రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని రావుపల్లికి చెందిన గడిదేసి రాంబాబు గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న మండల జనసేన అధ్యక్షులు బోను శివ, కార్యకర్తలు స్పందించి తమవంతు సాయంగా రూ.57వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని రాంబాబు వైద్య ఖర్చుల ఆయన కుటుంబ సభ్యులకు స్థానిక ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, కురుపాం నియోజకవర్గం జనసేన ఇన్చార్జి కడ్రక మల్లేష్ చేతుల మీదుగా అందజేశారు. అలాగే సిఎం రిలీఫ్ ఫండ్ కోసం ఎమ్మెల్యే సహాయంతో దరఖాస్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పాలకొండ : పట్టణానికి చెందిన కుప్పిలి కృష్ణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకుని పాలకొండ శిష్టకరణం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కృష్ణ తల్లి అమ్ములమ్మకు రూ.36వేలు ఆర్థిక సాయం అందించారు. తమ సంఘంలో కష్టంలో ఉన్న వారిని ఆదుకోవడం తమ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో బాసూరు కాంతారావు, శివబాల, రమేష్ కుమార్,బుజ్జి, కాశీ ప్రసాద్ తదితరులు ఉన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడిఒ స్వరూపరాణి

సేవలు అందించే వారికే గుర్తింపు

ప్రజాశక్తి - సీతానగరం

సేవలందించే వారికి గుర్తింపు ఉంటుందని పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పశు వైద్యశాలలో ఆదివారం బదిలీపై వెళ్లిన సిహెచ్ దీనకుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సేవలు చేసే ప్రతి ఉద్యోగి ప్రజల మన్ననలను పొందుతారని, వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందని అన్నారు. టిడిపి నాయకులు, గ్రామ పెద్ద సాల హరిగోపాలరావు మాట్లాడుతూ దీనకుమార్ రైతుల పట్ల సేవా భావంతో పనిచేసేవారని కొనియాడారు. అనంతరం పాడి రైతులు, గ్రామ పెద్దలు ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో పెదబోగిలి వైస్ సర్పంచ్ కె.అరవింద్ కుమార్ గ్రామ పెద్దలు సుంకరబిల్లి ప్రసాద్, సాలా పాపారావు, ములగచర సత్యనారాయణ, ఈర్ల సూర్యనారాయణ, ఈర్ల రామకృష్ణ, మమ్ముల మహేష్, మండల పశువైద్యాధికారి ఎస్.రామారావు, కాశీపేట పాడిరైతులు టి.శ్రీనివాసరావు, టి.స్వామినాయుడు, ఎ.శ్రీనివాసరావు, టి.అప్పలనాయుడు, పశు వైద్య సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎల్ఐసి ఏజెంట్ల ఔదార్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలంలో బిజెపురానికి చెందిన కరకవలస రమణమూర్తి (ఎల్ఐసి ఏజెంట్) ఈనెల 8న కారు ప్రమాదంలో దుర్మరణం చెందిన విషయం తెలిసినదే. అయితే ఆదివారం ఎల్ఐసి ఏజెంట్ల యూనియన్ సభ్యులు జి.జగన్నాధం నాయుడు, ఎం.నారాయణ స్వామి, రామకష్ణ, ఉమామహేశ్వరరావు, వరప్రసాద్, రమేష్, ఏకోబు, సత్యం నాయుడు తదితరులు రమణమూర్తి కుటుంబానికి రూ.10 వేలు అందజేశారు. మీకు ఎల్లపుడూ ఎల్ఐసి ఏజెంట్లు యూనిట్ అండగా ఉంటుందని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

సూర్యపీఠంలో విశేష పూజలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ శివారులో గల శ్రీ సూర్య పీఠంలో ఆదివారం బ్రహ్మశ్రీ వేమకోటి నరహరి శాస్త్రి ఆధ్వర్యంలో సూర్య భగవానునికి భానువార ప్రయుక్త సౌర దీక్షలో సూర్య నమస్కారాలు చేశారు. అలాగే సౌరారుణ పారాయణ సహిత హోమం, రుద్రమన్యుసూక్త మంత్ర హవనం, సుదర్శన హోమం, ఆదిత్య పంచాయతన క్షీరాభిషేకం, తదితరు యాగాలు నిర్వహించారు. కార్యక్రమంలో వేమకోటి వివేకానంద్, వేమకోటి శివ శర్మ, వేమకోటి బద్రి శర్మ, డి.ఉమాశర్మ, టిఆర్ కృష్ణ శర్మ, కేశవ శర్మ తదితరులు పాల్గొన్నారు..

పూజలు నిర్వహిస్తున్న పండితులు

వెంకమ్మ సాగరానికి జలకళ

ప్రజాశక్తి - వీరఘట్టం

జలకళతో నిండిన వెంకమ్మ సాగరం



మండలంలోని యం.వెంకంపేట పంచాయతీ పరిధి వెంకమ్మ సాగరంలో కళకళలాడుతుంది. మొన్నటి వరకు బీడు భూముగా దర్శన మిచ్చిన వెంకమ్మ సాగరం ఇటీవల కురిసిన వర్షాలకు అందులో నీరు చేరడంతో సుమారు 400 ఎకరాల విస్తీర్ణం గల ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధికి అంతా కలిసి రావాలి : మంత్రి

వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పేదలకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఏ ఒక్కరూ విఘాతం కలిగించకుండా వాటిని సక్రమంగా అమలయ్యేలా ప్రభుత్వానికి సహకరించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. ఆదివారం నాడు సాలూరు పట్టణం 2,5 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే ఆర్‌పి భంజ్‌దేవ్‌తో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకే చెందాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా స్థానిక సంస్థల్లో అధికారంలో గల వైసిపి మున్సిపల్ ఛైర్మన్లు అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని అలా విఘాతం కలిగించకుండా ప్రజలకు మంచి చేయాలన్న ఆలోచనతో ఉన్న ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలని అన్నారు. అప్పుడే అన్ని గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు. అనంతరం వార్డుల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్న సందర్భంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఈ ఏడాదిలో ప్రభుత్వం ద్వారా వారు అందుకున్న సంక్షేమ అభివృద్ధి పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, పప్పల మోహన్ రావు, కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ప్రభుత్వ విప్

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని చెముడుగూడ, అడ్డంగూడ, తాటిశీల, గ్రామాల్లో ఆదివారం మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేసి చూపించిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నామన్నారు. పింఛన్ రూ.1000 పెంచడానికి జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్లు పడితే చంద్రబాబునాయుడు అధికారంలోకి రాగానే ఒక్క సంతకంతో పింఛను రూ.4000 వేలకు పెంచారని అన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇచ్చామని, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతున్నామని తెలిపారు. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ కూడా అందజేస్తాం అన్నారు. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి ఛైర్పర్సన్ కడ్రక కళావతి, మాజీ సర్పంచ్ రామారావు, కొండలరావు, భాస్కర్ రావు, సదానంద్, రవి, శ్రీను, ఈశ్వర్, మంగయ్య, ప్రకాష్, కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

తాటిశీలలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

సమావేశంలో మాట్లాడుతున్న రాజన్నదొర

ప్రశాంతమైన ప్రాంతంలో అశాంతి రేపాలని చూస్తున్నారు

మాజీ డిప్యూటీ సిఎం రాజన్న దొర

ప్రజాశక్తి - మక్కువ

టిడిపి నేతలు ప్రతిపక్షంపై తప్పుడు మాటలతో రాక్షస ఆనందం పొందుతున్నారని, అది వారి వ్యక్తిత్వాన్ని తెలియజేస్తుందని, ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో అశాంతి రేపాలను చూస్తున్నారనిమాజీ డిప్యూటీ సిఎం పీడిక రాజన్న దొర విమర్శించారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షులు మామిడి రంగు నాయుడు అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో రాజన్నదొర మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసగించిందని విమర్శించారు. ప్రతినెలా పెన్షన్లు ఇవ్వడానికి మంత్రులు ఉన్నట్లు వారే పింఛన్లు పంచుతున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీల వల్ల ప్రజలు విరక్తి చెందుతున్నారని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేక ఎదుటివారిపైన బురద జల్లడం సమంజసం కాదన్నారు. కొంతమంది టిడిపి నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, తాము సంయమనం పాటిస్తున్నామే తప్ప చేతగాక కాదని ఆయన కూటమి నాయకులకు హెచ్చరించారు. తమ పార్టీ చేపట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి భయపడి కూటమి ప్రభుత్వం తల్లికి వందనం అమలు చేసిందని ప్రతి వ్యక్తికి ఇస్తామన్న తల్లికి వందనం పూర్తిగా అమలు కాలేదని అన్నారు. సూపర్ సిక్స్‌లో నిరుద్యోగ భృతి, ఆడ బిడ్డనిధి, అన్నదాత సుఖీభవ, దీపం, ఉచిత బస్సు, 50 ఏళ్లకే పెన్షన్ ఎప్పుడు ఇస్తారని, కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలు కావస్తున్నా ఇంకా ఇవ్వని పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని వైసిపి శ్రేణులకు తెలిపారు. సాలూరు నియోజకవర్గం నాయకులు అభివృద్ధి పైన మాటలు చెబుతున్నారని తాను 18 ఏళ్లుగా చేసిన అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా సిద్ధమని, ధైర్యం ఉంటే చర్చకు రావాల్సిందిగా పలుమార్లు పత్రికా ముఖంగా తెలిపినప్పటికీ భయపడి వారు పాల్గొనలేదని అన్నారు. గత ప్రభుత్వంలో రోడ్లు, వంతెనలు మంజూరు చేయించామని ఆ పనుల ఇప్పుడు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి మావుడి శ్రీనివా సరావు, సాలూరు మండల వైసిపి అధ్యక్షులు దండి శ్రీనివాసరావు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రజాశక్తి - కొమరాడ

పార్వతీపురం నుంచి లంజి గ్రామం వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, ఈ సమస్యపై ఇప్పటి వరకు 11 సార్లు కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించకపోవడం దారుణమని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారుల నిర్లక్ష్య వైఖరికి ఖండిస్తూ ఆదివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. పార్వతీపురం నుంచి కూనేరు మీదుగా లంజి గ్రామానికి గతంలో బస్సు ఉండేద, నాలుగేళ్ల క్రితం కరోనా వైరస్ వ్యాప్తి చెందిన సమయంలో ఈ బస్సు సర్వీసును రద్దు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే పార్వతీపురం నుంచి కూనేరుకు రాత్రి 9.30గంటలకు నైట్‌హాల్ట్ బస్సు ఉండేదని, ఈ బస్సును కూడా రద్దు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పార్వతీపురం నుంచి కల్లికోటకు బస్సు సౌకర్యం ఉండేదని, ఈ రూట్‌లో గల బస్సులను తొలగించారని ఈ మూడు రోడ్లకు సంబంధించి నేటికీ బస్సులు పునరుద్ధించలేదని అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు 11 సార్లు ఫిర్యాదులు చేశామని, గతంలో మాజీ డిప్యూటీ సిఎం పి.పుష్ప శ్రీవాణి, ప్రస్తుత ఎమ్మెల్యే తోయక జగదీశ్వరికి ఫిర్యాదు చేసినా బస్సులు నడపకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సుల రద్దుపై ఆర్‌టిసి అధికారులను అడగ్గా, ఆ రూటులో ప్రయాణికులు లేరని, రోడ్లు బాగోలేదని ఇంకో రోజు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈమూడు రూట్లలో బస్ సౌకర్యం కల్పించి ప్రజలను అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన కోరారు. లేకుంటే ఈగ్రామాల ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా స్థిరపడాలి

ప్రజాశక్తి - కొమరాడ

ప్రతి మహిళ స్వయం ఉపాధితో తమ కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చెందేలా తీర్చిదిద్దుతామని రేణుక స్వచ్ఛంద సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గొట్టాపు రేణుక అన్నారు. మండలంలోని శివిని సమీపంలో ఆర్ఎస్ రాయల్ అకాడమీ, రేణుక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు వృత్తి శిక్షణ నైపుణ్యతలో భాగంగా మహిళలకు వివిధ రంగాల్లో ఉచితంగా శిక్షణ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 6 మండలాల నుంచి ముఖ్య అతిథులుగా సర్పంచులు హాజరయ్యారు. మహిళలకు కుట్టు మిషన్ల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సర్పంచ్ కలింగ మల్లిబాబు చేతులమీరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ రేణుక మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో బడుగు, బలహీన, మైనార్టీ వర్గాలకు చెందిన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఈ స్వచ్ఛంద సేవా సంస్థ అనేక ఉచిత శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అలాగే పదో తరగతి, ఇంటర్, పీజీ వరకు చదువుకున్న విద్యార్థులకు వివిధ రంగాల్లో శిక్షణ ఇచ్చి ప్రముఖ కంపెనీలతో సంప్రదింపులు చేసి వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. టెన్త్ చదువుకున్న విద్యార్థులకు ఎంసెట్, పాలీసెట్టు ఇతర పోటీ పరీక్షలకు అతి తక్కువ ధరతో హాస్టల్ల సౌకర్యం కల్పించి మంచి ఫ్యాకల్టీతో కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గత వేసవిలో 800 మంది విద్యార్థులకు ఎంసెట్ కోచింగ్ ఇస్తామని తెలిపారు. అందులో 750 మంది విద్యార్థుల వరకు మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఈ కోచింగ్ అకాడమీకి వివిధ జిల్లాల నుంచి కూడా విద్యార్థులు అధికంగా వచ్చి శిక్షణ తీసుకుని మంచి ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్ల శిక్షణ, బ్యూటీ పార్లర్ కోర్సు, అల్లికలు, ఎంబ్రాయిడింగ్, తదితర విభాగాల్లో మహిళలకు శిక్షణ ఇచ్చి వారి కాళ్ల మీద వాళ్లు ఆర్థికంగా బలపడేందుకు తమ సంస్థ కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, సర్పంచులు కె.మల్లిబాబు, వై.సింహాచలం నాయుడు, గంగాధర్, ఎ.కిరణ్ కుమార్, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రేణుక

రవికి డాక్టరేట్

ప్రజాశక్తి - సీతంపేట

ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ గువాహటిలో ఇటీవల జరిగిన 27వ విద్యా స్నాతకోత్సవం సందర్భంగా రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జి అండ్ టెక్నాలజీ (ఆర్‌జియుకెటి) శ్రీకాకుళంలో బయోసైన్సెస్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ వెల్ఫేర్‌గా పనిచేస్తున్న డాక్టర్ గేదెల రవి డాక్టరేట్, పిహెచ్‌డి పట్టా అందుకున్నారు. రవి గువాహటి ఐఐటిలో డిపార్ట్మెంట్ ఆఫ్ బయోసైన్స్ అండ్ బయో ఇంజనీరింగ్ విభాగంలో ప్రొఫెసర్ వీరంకి వెంకటదాసు, ప్రొఫెసర్ కన్నన్ పక్షిరాజన్ మార్గదర్శకత్వంలో ‘ Studies on the Production of Lipids, Carotenoids and Beta-Carotene by the Oleaginous Yeast Rhodotorula mucilaginosa’ అన్న అంశంపై పరిశోధనలు నిర్వహించారు. ఈ పరిశోధనలో భాగంగా సైన్స్ డైరెక్ట్, స్ప్రింగర్, టేలర్, ఫ్రాన్సిస్ వంటి అంతర్జాతీయ పబ్లిషింగ్ సంస్థలకు చెందిన జర్నల్స్‌లో 10 అంతర్జాతీయ రీసెర్చ్, కాన్ఫరెన్స్ పేపర్లు ప్రచురితమయ్యాయని అన్నారు. రెండు దశాబ్దాల వ్యవధిలో ఐఐటి గువాహటి నుంచి రెండు ప్రతిష్టాత్మక డిగ్రీలు (ఎంటెక్ పీహెచ్డీ.) పొందడం గర్వకారణం. ఈ సందర్భంగా ఆయన పలువురు అభినందనలు తెలిపారు. పరిశోధనకు మార్గనిర్దేశం చేసిన ప్రొఫెసర్ వీరంకి వెంకట దాసు, ప్రొఫెసర్ కన్నన్ పక్షిరాజన్, డిపార్ట్మెంట్ హెడ్, ఐఐటీ గువాహటి డైరెక్టర్ అభినందనలు తెలిపారు.

డాక్టరేట్ పట్టాను అందుకున్న రవి

యూరియా అందించేందుకు చర్యలు : ఎఒ

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని రైతులకు అవసరమైన యూరియా, ఇతర ఎరువులను అందించేందుకు చర్యలు చేపడుతున్నామని మండల వ్యవసాయ శాఖ అధికారి ప్రసాద్ అన్నారు. మండలంలోని చోళ్లపదం రైతు సేవా కేంద్రంలో 12 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్లో రైతులకు ఎంతో అవసరమైన యూరియా అందించేందుకు ఇప్పటికే నివేదికలు పంపించామని, అధికారుల ఆదేశాల మేరకు ఎప్పటి వరకు 12 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని అన్నారు. మూడు రోజుల్లో మరో 100 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందించేందుకు తీసుకొస్తున్నట్లు తెలిపారు. రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అవసరమైన వరకు రైతులకు అందించేందుకు ప్రభుత్వం తరపున రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా అందజేస్తామని తెలిపారు. యూరియానే బ్లాక్ చేసి రైతులకు అధిక ధరలకు అమ్మకాలు చేసిన ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద అమ్మకాలు చేస్తే వారిపై ప్రభుత్వ నిబంధన ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగానే ఎరువుల అమ్మకాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మెరిట్ అభ్యర్థులే గెస్ట్ అధ్యాపకులవ్వాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మెరిట్ అభ్యర్థులే గెస్ట్ అధ్యాపకులు కావాలని కాంగ్రెస్ నాయకులు వి.దాలినాయుడు, కోలా కిరణ్ కుమార్, తీళ్ల గౌరీ శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని పలు కళాశాలల్లో గెస్ట్ ఫ్యాకల్టీ అధ్యాపకుల నియామకానికి అధికారులు ప్రకటన జారీ చేయడం సంతోషకరమన్నారు. ఓవైపు నిరుద్యోగులకు పని దొరకటం, విద్యార్థులకు అధ్యాపకులు లభించడం జరుగుతుందన్నారు. అయితే గెస్ట్ ఫ్యాకల్టీ ఎంపికలు ఎమ్మెల్యే, మంత్రుల సిఫార్సు లేఖలతో జరుగుతాయన్న ప్రచారంతో పలువురు అభ్యర్థులు సిఫార్సుల కోసం ఎగబడుతున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టి సారించి, సిఫార్సు లేఖలతో కాకుండా మెరిట్ అభ్యర్థులకే ప్రభుత్వ నిబంధనలు ప్రకారం గెస్ట్ ఫ్యాకల్టీగా ఎంపిక చేయాలని వారు డిమాండ్ చేశారు.

గజానికో గొయ్యి

అధ్వానంగా ప్రధాన రహదారి పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రమైన పార్వతీపురం ప్రధాన రహదారులపై గజానికొక గొయ్యి ఉండడంతో వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. పట్టణ శివారులో గల అంతర్‌రాష్ట్ర రహదారి, రాయగడ రోడ్‌లోని బ్రహ్మంగారి మఠం ఎదురుగా ఉన్న రోడ్డు, డంపింగ్ యార్డ్ వద్ద, దీప్తి లాడ్జి కూడలి నుంచి పాలకొండ రోడ్డు వైపు ఉన్న ఫ్లైఓవర్ పై ఎక్కడికక్కడే గుంతలు ఉన్నాయి. ఈ రహదారులపై ప్రయాణం ప్రమాదభరితమైనా తప్పనిసరి పరిస్థితుల్లో రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు దుస్థితి ఇంత అధ్వానంగా ఉంటే కనీసం వాటికి మరమ్మతులు చేయాలన్న ఆలోచన సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులకు కూడా లేకపోవడం దురదృష్టకరం. ద్విచక్ర వాహనదారులు, భారీ వాహనచోదకులు ఏమాత్రం ఏమరపాటుగా వాహనాలు నడిపినా ప్రమాదాల బారిన పడాల్సిందే. వర్షాలు కురిసే సమయంలో గుంతల్లో నీరు చేరిన సందర్భంలో వాహనదారులు తమ వాహనాలను నడిపే క్రమంలో గుంతల్లో పడి ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర ఆర్‌అండ్‌బి అధికారులతో సమీక్ష నిర్వహించి యుద్ధ ప్రాతిపదికన రహదారులపై ఉన్న గుంతలను పూడ్చేందుకు చర్యలు చేపట్టాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిపై ఏర్పడ్డ గొయ్యిలు

యశస్వినిని కలిసిన నేతలు

ప్రజాశక్తి గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా పర్యటనకు తొలిసారిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన తూర్పు కాపు ఆత్మీయ సమావేశంలో ఆమెను ఏజెన్సీ తూర్పు కాపు సంక్షేమ సంఘ అధ్యక్షులు కొనిశ మన్మధరావు, ఉపాధ్యక్షుడు సొంటేన రాజేష్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం వారు తూర్పు కాపు సామజిక వర్గానికి సంబంధించిన సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా ఏజెన్సీల్లో తూర్పు కాపు యువతకు విద్యా, ఉపాధి అవకాశాలు కల్పించేలా కార్పొరేషన్ ప్రత్యేక పథకాలు తీసుకురావాలని కోరారు. చైర్మన్ యశస్వి స్పందిస్తూ, రాష్ట్ర వ్యాప్తంగా తూర్పుకాపు వర్గాన్ని ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్పొరేషన్ ద్వారా పలు ఉపాధి పథకాలు అమలు చేస్తున్నామని, పేదలకు సాయం, స్వయం సహాయక వర్గాల కోసం రుణ సౌకర్యాలు, ఉద్యోగ నియా మకాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాం తాల కోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక తూర్పు కాపు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఎంఇఒల బదిలీలు వెంటనే చేపట్టాలి

పార్వతీపురం టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న ఎంఇఒ- 1లకు వెంటనే బదిలీలు చేపట్టాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ ద్వారా వినతి పంపించినట్లు ఎంఇఒ-1 అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.సింహాచలం తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఈ లేఖను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఇఒ -1 లకు 2017 నుంచి గత 8ఏళ్ల బదిలీలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన అయిన తర్వాత అన్ని శాఖల్లో బదిలీలు నిర్వహించారని, అయితే ఎంఇఒలకు మాత్రం ఇంతవరకు నిర్వహించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయమై మంత్రి లోకేష్‌కు తమ అసోసియేషన్ పక్షాన ప్రాతినిధ్యం చేశామని, ఇందుకు సానుకూలంగా స్పందించారని అన్నారు. అలాగే ఎంఇఒ-1లకు సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ లేకపోవడం వల్ల ఇబ్బందిగా ఉందన్నారు. కావున ఎంఇఒ-1లకు బదిలీలు, సెల్ఫ్ డ్రాయింగ్ పవర్స్ కల్పించడంలో జాప్యం చేయకుండా విద్యాశాఖ మంత్రి లోకేష్ చొరవ తీసుకోవాలని తెలిపారు.

ఎరుకుల సంఘం ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - భామిని

మండలంలోని తాళ్లడలో ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు గేదల సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం ఎరుకల సంఘం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ఎరుకల కులస్తులు ఐక్యంగా ఉండి, సమస్యల పరిష్కారానికి, కుల సభ్యుల ఎదుగుదలకు బాధ్యత వహించాలని తెలిపారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఎరుకలు మిగిలిన జిల్లాలతో పోల్చుకుంటే చాలా వెనుకబడి ఉన్నారని, ఆ వెనుకబాటుకు మన కులస్తులలో ప్రధానంగా అవగాహన రాహిత్యమని అన్నారు. మన కులస్తుల్లో ముందుకు నడిపే వ్యక్తులు లేకపోవడం, మనం సమిష్టిగా ప్రతి అంశం పట్ల శ్రమించుకపోవడం కారణాలని, ఇకపై మన అభివృద్ధికి మనమంతా ఐకమత్యంగా ముందుకు వెళ్లాలని సురేంద్ర అన్నారు. కార్యక్రమంలో దేవరకొండ, విజయ్‌కుమార్, నాగప్రసాద్ ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సాలూరురూరల్

పట్టణ బైపాస్ రోడ్డు పరిధిలో గల కల్లాల వద్ద ఆదివారం ఉదయం సాలూరు పట్టణం వెలంపేటకు చెందిన గొర్లె ధర్మారావు (38) స్కూటర్ ఇంటికి వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మరణించారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వెలంపేట వీధికి చెందిన ధర్మారావు తన కుమారుడుతో కలిసి ఆదివారం ఉదయం తన కల్లాల వద్ద పాలు తీసుకొని ఇంటికి బైపాస్ రోడ్డు మీదుగా వస్తుండగా అటువైపు నుండి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో స్కూటర్‌పై కింద పడి ధర్మారావు అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనలో మృతుడి కుమారుడు గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని, గాయాలు పాలైన వ్యక్తిని సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రమాదంలో మృతి చెందిన ధర్మారావు

ప్రకటన
మహారాజశ్రీ జిల్లా జడ్జి వారి
కోర్టు విజయనగరం
G.O.P.3/24

Between :
కండాపు లత .....పిటిషనర్
And :
కండాపు రవికుమార్ ....రెస్పాండెంట్

ఇందలి పిటిషనర్ అయిన కండాపు లత తన భర్త అయిన రవికుమార్ (రెస్పాండెంటు) పై జిల్లా కోర్టు విజయనగరంలో తన పిల్లలను అప్పగించాల్సిందిగా కోరుతూ పిటిషనను దాఖలు చేయగా సదరు రెస్పాండెంట్ రవికుమార్‌కి నోటీసును ఆర్డరు చేసియున్నారు. సదరు పిటిషన్ వాయిదా **తేది 25-07-2025** అయి ఉన్నది. కావున ఈ పిటిషన్ యిందలి రెస్పాండెంటు అయిన రవికుమార్ స్వయంగా కాని, వకీలు ద్వారా కాని ఆ రోజు **ఉదయం 10-00గం॥లకు** హాజరై తను వాదన వినిపించాల్సిందిగా కోరడమైనది. లేని ఎడల అతను హాజరు కానట్లు భావించి అతనికి పరోక్షంగా తదుపరి శ్రీ కోర్టువారు తగు నిర్ణయం తీసుకొందురు. సదరు రవికుమార్ S/o విష్ణుమూర్తి భామిని మండలం, బురుజోలు మన్యం జిల్లాలో నివసిస్తున్నట్లు పిటిషన్‌ను దాఖలు చేయడమైనది.

కూరెళ్ల నాగభూషణరావు
న్యాయవాది, విజయనగరం,
సెల్: 9441568472
విజయనగరం
తేది: 12-7-2025